క్లుప్తంగా

నేడు రంగాపూర్‌కు ఎంపీ రాక

హుజూరాబాద్‌రూరల్: రంగాపూర్ గ్రామంలో బీజేపీ పిలుపు మేరకు గావ్ చలో(పల్లె నిద్ర) కార్యక్రమంలో భాగంగా మంగళవారం కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ వస్తున్నట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని దళిత కాలనీలను సందర్శించడం.. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించడంతో పాటు బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం జరగనున్నట్లు చెప్పారు.

తాజా మాజీ పాలకవర్గానికి సన్మానం



రామడుగు: లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో సోమవారం గ్రామస్తులు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. తాజా మాజీ సర్పంచ్ చిలుముల రజితప్రభాకర్, ఉప సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సభ్యులు తోట నాగరాజు, దూట సతీష్, కనకమ్మ, మంజుల, సంధ్య, తిరుపతి, తిరుమల, గాదె లచ్చయ్యను సన్మానించారు.

శిఖం భూమిని స్వాధీనం చేసుకోవాలి



సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

గన్నేరువరం: గుండ్లపల్లి గ్రామంలో శిఖం భూమిలో నిర్మించిన డెయిరీతో పాటు భూమిని స్వాధీనం చేసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గన్నేరువరం తహసీల్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ ఫహీమ్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో పాలకేంద్రాలు ప్రభుత్వ ఆధీనంలో నడిచేవని తెలిపారు. ఇప్పుడు డెయిరీలు ప్రైవేట్ సంస్థలుగా మారిపోయాయని అన్నారు. మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, కోశాధికారి గర్శకుర్తి శ్రీనివాస్, బోయిని మల్లయ్య, కూస మల్లయ్య, రాపోలు రాజమల్లు, రామంచ కనకయ్య, ఎండీ నయూమ్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్‌రూరల్: రాంపూర్ గ్రామ శివారులో పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ సోమవారం తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేయగా.. ఏడుగురు పట్టుబడ్డారన్నారు. నలుగురు పారిపోయినట్లు తెలిపారు. రూ.17,600 నగదును సీజ్ చేశామని చెప్పారు. ఎస్ఐ సాంబయ్య, హెడ్ కానిస్టేబుల్ ఫసియుద్దీన్, కానిస్టేబుళ్లు అవినాష్, ప్రసాద్ శిబిరంపై దాడి జరిపి పట్టుకున్నారు.


నూతన నియామకం



ప్రవీణ్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: చిన్నపాపయ్యపల్లె గ్రామానికి చెందిన బీజేవైఎం నాయకుడు నరేడ్ల ప్రవీణ్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా హన్మకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియామకమయ్యారు. ప్రవీణ్‌రెడ్డి ఏబీవీపీలో పది సంవత్సరాలు కార్యకర్తగా పని చేశారు. బీజేపీలో చేరి బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, భూపాలపల్లి జిల్లా బీజేవైఎం ఇన్‌చార్జిగా పని చేశారు. ఇటీవల మంచిర్యాల అసెంబ్లీ ఇన్‌చార్జిగా పని చేశారు. తన నియామకానికి కృషి చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గొర్ల కాపరుల సంఘం అధ్యక్షుడిగా రాజేందర్



ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న మంజుల

జమ్మికుంట: జగ్గయ్యపల్లి గ్రామ గొర్ల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడిగా నరిగే రాజేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం గ్రామంలోని బీరన్న దేవాలయం ఆవరణలో ఎన్నికల అధికారి మంజుల(కరీంనగర్ అసిస్టెంట్ రిజిస్టర్) పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా జింకిరి రమేష్, కార్యదర్శిగా కంచ అరుణ్‌కుమార్, డైరెక్టర్లుగా గోవిందా శ్రీను, జిట్టా మహేందర్, కంకట కోమల, నీల లస్మమ్మ ఎన్నికయ్యారు. కుల సంఘ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

వీణవంక: బేతిగల్ గ్రామంలో గొర్ల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా చొటపల్లి రంజిత్, ఉపాధ్యక్షుడిగా బండారి ఐలయ్య, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల సర్వయ్య, కోశాధికారిగా వేల్పుల రమేష్, కార్యవర్గ సభ్యులుగా కంబాల రమేష్, కత్తెర్ల రాజు, ఎలవేణి రాజేందర్, ఈరాల ఎల్లయ్య, కంబాల లింగయ్య, ఆవుల కుమార్ ఎన్నికయ్యారు.

నీటి సరఫరాపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పావనివెంకటేశ్



శంకరపట్నం: పాల్గొన్న నాయకులు, అధికారులు

ఇల్లందకుంట: మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ సరిగొమ్ముల పావనివెంకటేశ్ అన్నారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి నివేదికలపై సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల పాలకవర్గం పదవీకాలం ముగియడంతో మండలస్థాయి అధికారులు ఆయా గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా పాలనలో భాగస్వాములవుతున్నారని అన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పారిశుధ్యం, హరితహారం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా చూడాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులపై ఉందన్నారు. వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ నీటిని ఎలాంటి ఆటంకాలు లేకుండా సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. టేకుర్తి శ్మశానవాటిక వద్ద విద్యుత్ లైన్ ప్రమాదకరంగా ఉందని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మోటపోతుల అయిలయ్య సమావేశం దృష్టికి తీసుకురాగా.. తక్షణమే విద్యుత్ లైన్‌ను పరిశీలించి మరమ్మతు పనులు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఎంపీపీ ఆదేశించారు. ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ రాణి, ఎంపీటీసీలు ఓదేలు, ఎక్కటి సంజీవరెడ్డి, దాంసాని విజయకుమార్, రమ, ఎంపీవో వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారిణి రజిత, మండల విద్యాధికారి శ్రీనివాస్, వైద్యాధికారి తులసీదాస్, ఏపీఎం రమాదేవి పాల్గొన్నారు.

వాడివేడిగా సర్వసభ్య సమావేశం

శంకరపట్నం: ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ సరోజన అధ్యక్షతన వాడివేడిగా జరిగింది. ఉపాధిహామీ, విద్యుత్ తదితర సమస్యలపై అధికారులను ఎంపీటీసీలు ప్రశ్నించారు. దీంతో సమావేశం రసాభాసగా జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ అనుపమ, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

ద్రోన్ పిచికారితో సమయం, ఖర్చు తగ్గుతుంది



యంత్రాన్ని ప్రారంభించిన ఏడీఏ సునీత, రైతులు

జమ్మికుంట: వ్యవసాయ పొలంలో డ్రోన్‌తో పిచికారి చేస్తే సంపూర్ణంగా చీడపీడల నివారణ, సమయం, ఖర్చు తగ్గుతుందని హుజూరాబాద్ ఏడీఏ సునీత అన్నారు. మడిపల్లి గ్రామంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ విస్తరణ అధికారుల ఆధ్వర్యంలో కరీంనగర్ ఇఫ్కో కంపెనీ, ఆగ్రో రైతు సేవాకేంద్రం వారి తరఫున రైతుల సేవల కోసం డ్రోన్ యంత్రాన్ని సోమవారం ప్రారంభించారు. నానో యూరియా, నానో డీఏపీ రైతులకు అందించేందుకు ఆగ్రో రైతు సేవాకేంద్రం ఏర్పాటు చేసిందని, అందులో భాగంగా డ్రోన్ సదుపాయాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో జిల్లా మేనేజర్ బాలాజీ, గ్రామ మాజీ సర్పంచ్ పరశురాములు, మాజీ ఎంపీపీ రాజమల్లు, సీడ్ ఆర్గనైజర్ మల్లాగౌడ్, ఆగ్రో రైతు సేవాకేంద్రం నిర్వాహకుడు మల్లికార్జున్, గ్రామాల ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

తిమ్మాపూర్(మానకొండూర్): బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిందని, కాంగ్రెస్, బీజేపీ మాత్రం అసత్యాలు ప్రచారం చేశాయని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిందని ఆరోపించారు. సోమవారం బీఆర్ఎస్ మానకొండూర్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో అల్గునూరు లక్ష్మీనరసింహ గార్డెన్‌లో నిర్వహించారు. స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చినట్లు చెప్పుకుంటోందని విమర్శించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మండలాల అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్మన్, మహిళా సంఘ సభ్యులు

జమ్మికుంట: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని 21వ వార్డులో ఓటర్ అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా సమాఖ్య సంఘాలతో రుణాలు, నిల్వపై చర్చించారు. ఓటు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. వార్డు అధికారి స్వాతి, అంగన్‌వాడీ టీచర్ కవిత, ఆర్పీ షాహీన్, బీఎల్‌వో లత, మహిళలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

14న సామూహిక అక్షరాభ్యాసాలు

చొప్పదండి: మండల కేంద్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో ఈనెల 14న సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సింహాచలం జగన్‌మోహన్ స్వామి, భాష్యం నవ్యకుమార్ తెలిపారు. 14న అమ్మవారి మూల నక్షత్రం ఉన్నందున ఆలయంలో వసంత పంచమి వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలుంటాయని, భక్తులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీరాముడిని దర్శించుకున్న నాయకులు



గన్నేరువరం: మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపొందిన సందర్భంగా చొక్కారావుపల్లెకు చెందిన కాంగ్రెస్ నాయకులు అయోధ్య రాముడిని సోమవారం దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నట్లు టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, బూర శ్రీనివాస్, సంతోష్ తెలిపారు.

సమ్మక్క జాతర పోస్టర్ ఆవిష్కరణ



శంకరపట్నం: సమ్మక్క–సారలమ్మ జాతర పోస్టర్‌ను సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈవో మారుతి, చైర్మన్ గుర్రం స్వామి, బొజ్జ రవి, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు విరాళం



గన్నేరువరం: మైలారం గ్రామంలోని సమ్మక్క–సారలమ్మ గద్దె వద్ద చేపట్టే అభివృద్ధి పనులకు గ్రామ మాజీ సర్పంచ్ దుడ్డు రేణుక, కాంగ్రెస్ నాయకుడు దుడ్డు మల్లేశం రూ.30,016ను జాతర కమిటీ చైర్మన్ విలాసాగరం రామచంద్రంకు సోమవారం విరాళంగా అందజేశారు. జాతర కమిటీ సభ్యులు వారిని శాలువాతో సన్మానించి అభినందించారు. మైసంపల్లి తిరుపతి, వోడ్నాల నర్సయ్య, దుడ్డు నాగరాజు, పూజారి బుర్ర రాములు, బుర్ర శ్రీనివాస్, పేరం కొమురయ్య, మేస్త్రీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో వైద్య సేవలు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి: వంద పడకల ఆసుపత్రి నిర్మాణం ద్వారా అన్ని రకాల వైద్య సేవలను పేదలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. పట్టణంలోని బీసీ కాలనీ పక్కన రూ.37.50కోట్లతో నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా చేపట్టిన వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఆయన సోమవారం భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. చొప్పదండి పట్టణం, మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల ప్రజలకు వైద్య సేవలు ఈ ఆసుపత్రి ద్వారా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఉండే ప్రధాన వైద్యశాలకు దీటుగా పట్టణంలో నిర్మించబోయే ఆసుపత్రిలో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, ఎంపీపీ చిలుక రవిందర్, జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, వైద్య శాఖ అధికారులు డాక్టర్ కృష్ణప్రసాద్, ఈఈ రవీందర్, నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం తిరుపతిగౌడ్, బిజిలి అనిత, కొట్టె అశోక్, మాదూరి శ్రీనివాస్, కొత్తూరి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు మాగంటి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి జమ్మికుంట గ్రామీణ వైద్యులు(ఆర్ఎంపీ) సంక్షేమ సంఘం అధ్యక్షుడు పైడిపల్లి భీమన్న ఆధ్వర్యంలో మృతుడి భార్య వనితకు రూ.10వేలు ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. వేముల అశోక్, ఎండీ సలీంపాషా, పర్లపల్లి భిక్షపతి, దాటి భీమన్న, హరి, సదానందం, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వీణవంక: మండల కేంద్రానికి చెందిన గెల్లు అశోక్ యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. పదోతరగతి మిత్రులు సోమవారం మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసున్నారు. మృతుడి కుటుంబానికి రూ.35వేల ఆర్థిక సాయం అందించారు. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంబాల రాజేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. పరామర్శించి వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు. అమృత ప్రభాకర్, ఓరెం పూర్ణచందర్, ముద్దెర శ్రీనివాస్, అంకూస్, ఐలవేన రామన్న, గిరివేన రవీందర్, కోమాల్‌రెడ్డి, తిరుపతి, అంబాల నర్సింగ్ ఉన్నారు.

చిన్నారులకు చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

రామడుగు: వెంకట్రావుపల్లి గ్రామంలో తల్లిదండ్రులు దైవాల పర్శారాం, పావని అనారోగ్యంతో మృతిచెందగా.. వారి కుమార్తెలు అక్షర, కృషిత అనాథలుగా మారడంతో పలువురు దాతలు అండగా నిలిచారు. రుద్రారం గ్రామ ఎంపీటీసీ గుర్రం దేవికరాజశేఖర్‌గౌడ్ సోషల్ మీడియా ద్వారా పలువురు దాతల నుంచి విరాళం సేకరించారు. రూ.47వేలు రావడంతో వాటిని సోమవారం వెంకట్రావుపల్లి గ్రామానికి వెళ్లి చిన్నారులకు అందజేశారు. మాజీ సర్పంచ్ జవ్వాజీ శేఖర్, గల్ఫ్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చిలుముల రమేష్, నాయకులు లక్ష్మణ్, రాజు, శ్రీనివాస్, మోహన్, కరుణాకర్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన

- యాసంగిలో చీడపీడల నివారణకు సూచనలు



ఆకునూర్‌లో పంట పరిశీలిస్తున్న అధికారులు

సైదాపూర్: జమ్మికుంట కేవీకే కీటక శాస్త్రవేత్త శ్రీనివాస్, ఏఈవో వంశీ సోమవారం ఆకునూర్‌లోని రైతుల పొలాల్లో పంటలను పరిశీలించారు. యాసంగి వరిలో జింక్ లోపం, సల్ఫైడ్ స్వభావం, మొగిపురుగు ఉధృతితో మొక్కలపై నుంచి 3 నుంచి 4 ఆకుల్లో మధ్య ఈనె పాలిపోతుందని రైతులకు శాస్త్రవేత్త శ్రీనివాస్ అవగాహన కల్పించారు. లోపం ఎక్కువైతే ఈనెలకు తుప్పు పట్టినట్లు ఇటుక రంగు మచ్చలు కన్పిస్తాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నత్రజని ఎరువులు వేసినా పైరు పచ్చబడదన్నారు. జింక్ లోపం ఉన్న నేలల్లో ఒకే వరి పంట పండించే పొలాల్లో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలని సూచించారు.

ప్రత్యామ్నాయంగా..

- 10 కిలోల జింక్ సల్ఫేటును 200–250 కిలోల మాగిన పశువుల పెంటలో కలిపి గోనె సంచిలో నెల రోజులు మాగిన తర్వాత చివరి దుక్కిలో వేయాలి.
- పైరుపై జింక్ లోపం కన్పించగానే లీటర్ నీటికి 2గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణం(ఇతర పురుగు మందులు కలపకుండా) కలిపి 5 రోజుల వ్యవధిలో రెండు మూడుసార్లు పిచికారి చేయాలి. చౌడ్ నేలల్లో తప్పనిసరి చల్లాలి.

సల్ఫైడ్ దుష్ప్రభావం

వరి నేలల్లో పంట మధ్యకాలంలో అక్కడక్కడ గుంపులుగుంపులుగా పెరిగిన పంట పసుపు వర్ణంలోకి మారిపోవడం, అక్కడి నేలల్లో సల్ఫైడ్ దుష్ప్రభావంతో నేలమడి బాగా మెత్తబడి కాలు లోతుగా దిగుతుంది. నడుస్తుంటే కాలు లోపలికి దిగిపోయి నీటిలో గాలి బుడగలు వస్తాయి. కోడిగుడ్డు వాసన వస్తుంది. వేర్లు కుల్లిపోయి మొక్కలు పూర్తిగా చనిపోయే ప్రమాదముంది.

దీనికి కారణం..

అధిక నీటి ముంపు ఉండడం, తగిన రీతిలో వరి వేర్లకు గాలి అందకపోవడం, రసాయనిక చర్యలతో లభ్యమైన ఇనుము మార్పు చెందడం, చాలాకాలంగా బరువు నేలల్లో సల్ఫర్ కలిగిన 20–20–0–15, 20–20–0–13 లాంటి కాంప్లెక్స్ ఎరవులు అధికంగా వాడటంతో ఇలా జరుగుతుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

- మొక్క వేర్లకు గాలి తగిలేలా మురుగు నీటిని తీసి మళ్లీ నీరందివ్వాలి.
- పైరు వేయడానికి ముందు మట్టిని కలియదున్ని ఆరబెట్టాలి. కొత్తగా మట్టి పోయాలి. పంట మధ్య కాలంలో నెర్రెలు బారేలా ఆరబెడుతూ నీరివ్వాలి. ఈ చర్యలతో సల్ఫైడ్ దుష్ప్రభావం తగ్గుతుంది. అమ్మోనియం సల్ఫేటు ఈ రకం నేలల్లో వేయొద్దు.

కాండం తొలిచే పురుగు

వారం రోజులుగా కాండం తొలిచే పురుగుల ఉధృతి కన్పిస్తోంది. నారుమడిలో ఆశిస్తే మొక్కలు, పిలక దశలో ఆశిస్తే మొవ్వలు ఎండి చనిపోతాయి. అంకురం నుంచి చిరు పొట్ట దశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయి. ఉష్ణోగ్రతలు సమతుల్యంగా లేకపోవడం, నత్రజని తక్కువగా వాడడంతో కాండం బలహీనపడి కాండం తొలిచే పురుగులు ఆశిస్తాయి. నివారణగా నారు పీకే ఏడు రోజుల ముందు కార్బోఫ్యూరాన్ గులికలు చల్లాలి. నాటు వేసేటప్పుడు కొనలను తుంచాలి. పురుగుల ఉధృతిని గమనించి దీపపు ఎర, సోలార్ దీపపు ఎర, లింగాకర్షక బుట్టలు కట్టాలని రైతులకు శాస్త్రవేత్త శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న అజయ్

హుజూరాబాద్: గురుకుల పాఠశాల విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి గోస్కుల అజయ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భువనగిరిలోని గురుకుల పాఠశాలలో ఆత్మహత్యకు పాల్పడిన పదోతరగతి విద్యార్థుల మృతిపై అనేక అనుమానాలున్నాయన్నారు. ఆటో డ్రైవర్లను వార్డెన్ విద్యార్థినుల వసతి గృహాల్లోకి ఎలా అనుమతించారో అధికారులు విచారణ జరపాలన్నారు. నాయకులు అరుణ్, సాయి, విజయ్, శ్రావణ్, రాణి, అర్చన, శ్రీకాంత్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

హుజూరాబాద్: రెండో విడత దళితబంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దళితుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ద్వారా ఎంతోమందికి ప్రయోజనం చేకూరిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితబంధు అకౌంట్లను ఫ్రీజ్ చేయించి వారి జీవితాలను ఆగం చేసిందన్నారు. నిధులను విడుదల చేయకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

షరతుల్లేకుండా విడుదల చేయాలి



మాట్లాడుతున్న రాజు

హుజూరాబాద్: ఎలాంటి షరతుల్లేకుండా రెండో విడత దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పాటి రాజు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని వీణవంక, జమ్మికుంట మండలాల్లో దళితబంధు రెండో విడత నిధులు రాక లబ్ధిదారులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు బోరగాల సారయ్య, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రావుల వేణు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి వోడ్నాల విజయ్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు తూర్పాటి రాజశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెంటనే విడుదల చేయాలి

వీణవంక: దళితబంధు రెండో విడత నిధులు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు అప్పులపాలై ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వం కలగజేసుకొని వెంటనే విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మోరే అరుణ్‌మాదిగ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మాట్లాడుతూ.. దళితులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం దళితబంధు పథకం తీసుకొచ్చిందని, కానీ చాలామందికి రెండో విడత దళితబంధు నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అంబాల మధునయ్య, కల్లెపల్లి దామోదర్, కోరుకంటి రాజు తదితరులు పాల్గొన్నారు.